

కథా కౌముది

# అనగనగా ఒక ఊరు డా.మజ్జి భారతి

కథలన్నీ "అనగనగా ఒక ఊరు" అంటూ మొదలవుతాయి. ఈ కథ మాత్రం తన బాల్యస్మృతులను వెతుక్కుంటూ బయలుదేరిన ఇందుతో మొదలవుతుంది. మరెందుకాలస్యం? పదండి. మనమూ ఇందుతో పాటు వెళ్దామావూరు.

★★★★★

"ఇందు టెర్రస్ మీదకెళ్ళి గంటయింది. ఇంకా కిందికి రాలేదు" అన్న భార్య సుమిత్రమాటలు విని ఇందుని పిలవడానికి వచ్చిన కృష్ణమూర్తి, ఇందు మాటలు వినిపించి మెట్లమీదే ఆగిపోయాడు.

"నా చిన్నప్పుడు ఇక్కడ సన్నజాజి, మల్లెతీగలు మేడమీదకు ప్రాకి ఎంత గుబురుగా ఉండేవంటే 'నాకు కోపంవచ్చి, అలిగి ఇక్కడే దాక్కుంటే బావవచ్చి నన్ను వెతికినా కనిపించనంత గుబురుగా ఉండేవి. ఇప్పుడవేవి లేవు. అసలు అమ్మమ్మవాళ్ళిల్లు ఎలా ఉండేదంటే.... పాతకాలంనాటి మేడ, ఎత్తైన అరుగులు, చుట్టూ ప్రహరీ గోడ. ఆ ఎత్తు అరుగుల మీదనుండి ఎగిరి, రోడ్డుమీద వచ్చి,పోయేవాళ్లను చూడడం ఒక సరదా. మీదియిల్లు మిద్దెలాగ ఉండేది. మిద్దె ఇంటిముందున్న చిన్న పిట్టగోడ, పందిరిమంచం చుట్టూ ఉండే గిలకల మాదిరిగా ఉండేది. ఆ ఖాళీల మధ్యనుండి వీధిలో వచ్చీ,పోయేవాళ్లను చూస్తుంటే, ఎంత బాగుండేదో! ఇంటిముందున్న ఖాళీస్థలంలో ఒకవైపు నందివర్ధనం, ఇంకోవైపు రకరకాల మందారాలు, ధనుర్మాసం వస్తే బంతులు, చామంతులు, మల్లె,సన్నజాజి మేడమీదకి పాకి.... ఇప్పుడవేవి లేవు.

ఊరిలో ప్రతి ఇంటిముందూ అరుగులు, వాటిపై ఏదో ఒక పనిచేసుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్న ఇరుగుపొరుగులు.... ప్రతి ఇంటిముందూ రంగవళ్ళులు... ఏ కొద్ది స్థలమున్నా పూలమొక్కలు పెంచి.... ఎంతందంగా ఉండేదో అమ్మమ్మవాళ్ళ వూరు... ఇప్పుడావూరూ అన్ని వూర్లలాగే ఉంది. నా చిన్నప్పటి వూరిలాగ లేదు" జీరబోయిన గొంతుతో ఫోనులో చెప్తుంది ఇందు ఎవరితోనో.

నిజమే! ఇందు చెప్పినట్టు సన్నజాజి, మల్లెతీగలు దట్టంగా ఉండేవి. వాటిమధ్య దాక్కునేది ఇందు. అది తెలిసినా తెలియనట్టు అక్కడక్కడే వెతికి, ఎప్పటికో తీగలు కదిపి అప్పుడే చూసినట్టు "ఇక్కడుందా మా ఇందమ్మ!" అని

ఆశ్చర్యపోయినట్టు నటిస్తే, కిలకిలమంటూ బయటకొచ్చేది. ముప్పయ్యేళ్లైందేమో! ఇందు ఈ ఇంటిని విడిచి. చిన్నప్పటినుండి ఇక్కడే పెరిగి... పదవ తరగతి పరీక్షలు రాసిన పదిహేనేళ్ల ఇందుకి, ఇంటరుతో చదువాపేసిన యిరవయ్యేళ్ళ తనతో, పెళ్లికి ముహూర్తాలు చూస్తుంటే... నాకీ పెళ్లివద్దని, చదువుకుంటానని, ఏడ్చి, గోలచేసి ఈ ఇంటిని విడిచి.... అక్కడితో ఇందుకి, ఈ ఇంటికి సంబంధం పూర్తిగా తెగిపోయింది.

అసలు ఇందు పుట్టడంతోనే కృష్ణమూర్తి పెళ్ళాంగా పుట్టింది... చిన్నప్పటినుండి "నీ కాబోయే పెళ్ళాం" అని అందరూ అంటుంటే తన మనసులో ఆశలఊహలు చిగుర్లుతొడిగేవి. తమ భావిజీవితాన్ని ఊహించుకుంటూ మనసు ఆనందంలో తేలిపోయేది. చిన్నప్పటినుండి ఇందునే భార్యగా ఊహించుకుంటున్న తనకది పెద్ద ఆశనిపాతమే. ఆ తర్వాత కొన్నాళ్లకు తన పెళ్లి సుమిత్రతో.... ఇంజనీరింగ్ చదివిన ఇందు, పెళ్లి చేసుకొని భర్తతో అమెరికా వెళ్లి, అక్కడే సెటిలై...

ముప్పయ్యేళ్లుగా కలవడంగాని, ఫోనులో మాట్లాడటంగాని లేనిది, ఇప్పుడెందుకొచ్చింది? వాళ్ల బావగారి కూతురు పెళ్లికి ఒకనెల ముందుగా వచ్చారని తెలుసు. ఇంతలో ఏమైంది? ముప్పయ్యేళ్ల తరువాత మొదటిసారిగా ఇందు గొంతు ఫోనులో... "బావా! అక్కడకు రావాలని ఉంది. మీకు పర్వాలేదా?" అని పరాయివాళ్ళలాగ. వచ్చిననుండి మూడీగానే ఉంది. భర్తతో ఏమన్నా గొడవలా?

ఇందుమాటలు వినిపించి ఆలోచనలనుండి వర్తమానంలోకి వచ్చాడు కృష్ణమూర్తి. "నిజమేనండి. మీరు చెప్పినవరకు నాకు తోచలేదు. ఎప్పుడో తాతలనాడు కట్టిన ఇల్లు ఇంకా అలాగే ఉండాలంటే, కుదరదు. ఇల్లులే కాదు ఏమిటో మనుషులు కూడా మారిపోయారు. ఎవరూ అప్పుడిలా లేరు"

అటునుండి ఏమి సమాధానం వచ్చిందో....

"నిజమేనండి. మార్పు సహజమే. నేనే గతంలో ఉండిపోయాను. నేనుకూడా అప్పటిలా లేను. అప్పుడు రెండుజడలు, పరికిణీలు..... ఇప్పుడేమో పోనీటైల్, చుడీదార్లు.... అప్పుడు చిన్న పిల్లలం. ఏ బాదరబందీ లేనివాళ్ళం. ఇప్పుడు సంసారబాధ్యతలలో మునిగి తేలుతున్నాం. నిజమే అప్పటిలా ఉండలేము." ఈసారి నవ్వుతూ ఇందూ మాటలు... వాళ్ళాయనతో అయివుంటుంది. ఈ ఏకాంతంలో, వాళ్ళాయనతో, చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకుంటుంటే.... వాటికి భంగం కలిగించకుండా, నెమ్మదిగా మెట్లుదిగి క్రిందికెళ్లిపోయాడు కృష్ణమూర్తి.

★★★

"బావా! ముందు చిన్న చెరువుకి తీసుకెళ్ళు" అన్న ఇందుని, అక్కడకు తీసుకెళ్తే "బావా చెరువేదీ?" గుండె చెరువైపోయినంత భారంగా అడిగింది ఇందు. చిన్నచెరువు.... అప్పుడెలా ఉండేది? పేరుకి చిన్నచెరువన్న మాటేకాని పెద్దగానే ఉండేది.

మంచినీటికన్న పేరుతో, బిందె పట్టుకొని వెళితే ఆడవాళ్ళ కబుర్లకు అదే కొలువు. స్నానానికని వెళ్ళిన మగవాళ్లకు ఆటవిడుపు. నీలాటిరేవు నుండి మగవాళ్ళరేవు వరకు మాటలు, హాస్యాలు, నవ్వులు షికార్లు చేసేవి. సెలవురోజుల్లో స్కూలు

పిల్లలకదొక నెలవు. గంటలకొద్దీ ఈత కొడుతున్నవాళ్లు, ఈత నేర్చుకుంటున్న వాళ్లు, నీళ్లంటే భయపడి ఒడ్డునే ఉన్నవాళ్లు... ఆడ,మగ తేడా లేకుండా పిల్లలంతా అక్కడే ఉండేవాళ్ళు.

త్రోవపక్కన ఊరికి దగ్గరగా, చెరువులో మంచినీళ్లు పట్టుకునే భాగాన్ని నీలాటిరేవు అనేవారు. అక్కడికి దూరంగా ఇంకోప్రక్క మగవాళ్ళు స్నానాలుచేసే రేవు, యింకా ఆ వెనకవైపు తామరపూలు, కలువపూలు.... తెలుపు, ఎరుపు, నీలం రంగులలో నిండుగా.... ఆదివారమొస్తే ఇందుకోసం తామరపువ్వులు కోసేవాడని, "కాబోయే పెళ్ళాన్ని ఇప్పటినుండే మంచి చేసుకుంటున్నాడని" వరసైనవాళ్లు హాస్యమాడేవాళ్లు కృష్ణమూర్తిని. ఆ విషయం గుర్తుకొచ్చి మనసు భారమైపోయింది కృష్ణమూర్తికి.

అప్పట్లో ఏ సమయంలో చెరువుకెళ్ళినా, మనుషులతో నిండుగా కళకళ్ళాడుతూ ఉండేది. మరిప్పుడో.... అప్పటి చెరువు స్థానంలో చిన్న నీటిగుంట... మురికినీళ్లతో, ప్లాస్టిక్ చెత్తాచెదారంతో... ఆక్రమణకు గురై చుట్టూ యిళ్ళలతో...

నిరుత్సాహాన్ని పక్కకు నెట్టేసి, "పెద్ద చెరువుకెళ్దాం బావా!" నవ్వును ముఖంపై అరువు తెచ్చుకుంటూ అంది ఇందు. ఒకప్పుడు అర కిలోమీటరు పొడవుండే పెద్ద చెరువు.... చెరువులోని నీళ్లు ఊరి పంటపొలాలకి, చేపల పెంపకానికి, పశువుల స్నానాలకి వాడేవాళ్లు. చెరువుగట్టుకు ఆవల పొలాలు.... గట్టెక్కితేగాని కనిపించేవి కావు. అంత ఎత్తుగా ఉండేది చెరువుగట్టు. చిన్నచెరువు కన్నా, గొప్పగా లేదు పెద్దచెరువు పరిస్థితిప్పుడు. ఆక్రమణలతో ఇప్పుడదీ కుంచించుకుపోయి, చెత్తాచెదారంతో నిండిపోయి ఉంది. గట్టుమాత్రం మిగిలిపోయి ఉంది. పచ్చని పొలాలైనా కనిపిస్తాయేమోనని ఎంతో ఆశగా గట్టెక్కిచూసింది ఇందు. గట్టెక్కిచూస్తే ఏముంది? కనుచూపుమేరా పచ్చదనంతో అలరారే పంటపొలాలు లేవిప్పుడు. చెదురుమదురుగా యిళ్ళలు, పిచ్చి మొక్కలతో నిండిపోయిన మిగిలిన ఖాళీప్రదేశం. ఇందుముఖం చూస్తే "అయ్యో! పాపం" అనిపించింది కృష్ణమూర్తికి. దిగులునిండిన ముఖంతో ఇంటిదారి పట్టింది ఇందు.

★★★★

"చిన్నచెరువు గుర్తుకొస్తే బావ నాకు కోసిచ్చిన తామరపూలే గుర్తుకొస్తాయిప్పటికీ. పెద్దచెరువంటే.... వర్షాకాలమొస్తే చప్టా మీదుగా పరవళ్ళు తొక్కుతూ, ప్రవహించే నీటి ఉరవడిలో ఎగిరి గంతులేయడం గుర్తుకొస్తుంది. మామిడితోటన్న మాట వినిపిస్తే.... గాలివాన వెలిసిన వెంటనే, క్రింద పడిపోయిన మామిడికాయలు ఏరుకోవడానికి పరుగులు తీయడం గుర్తుకొస్తుంది. అసలు అమ్మమ్మవాళ్ళ ఊరంటేనే... ఏ పండుగొచ్చినా మామిడిచెట్టుకు బావ కట్టిన ఉయ్యాలలో ఊగడం... రెండు చేతులకూ గోరింటాకు పెట్టుకోవడం....

స్వాతంత్ర్య దినోత్సవం నాడు మొగలిరేకుల జడలు వేసుకుని ఊరంతా తిరగడం, ధనుర్మాసమొస్తే పెద్ద పెద్ద రంగవల్లులు తీర్చిదిద్దడం, సంక్రాంతి రోజుల్లో నెయ్యల చక్కీలు తినడం, అమ్మమ్మ చేతి గోరుముద్దలు తినడం, అలిగి మల్లెపందిరి గుబురులో దాక్కోవడం, మామయ్య, అత్తయ్యల ఆప్యాయతల మధ్య పెరగడం, బావ ముద్దుచేస్తే ఆత్మీయంగా ఫీలవ్వడం... యివే గుర్తుకొస్తాయి. ఇప్పుడు అమ్మమ్మా లేదు. అత్తయ్య, మామయ్యలూ లేరు. అప్పటి మల్లెపందిరీ లేదు.

మామిడితోటలూ లేవు. చిన్నచెరువూ లేదు, పెద్దచెరువూ లేదు. అప్పటి ఆప్యాయతలూ లేవు, అనుబంధాలూ లేవు. అసలు ఈ ఊరు నేను చిన్నప్పుడు పుట్టిపెరిగిన ఊరులా లేదు. బావవున్నా... ఏమిటో! పరాయివాడిలా అనిపిస్తున్నాడు."

ఇందు ఫోనులో మాట్లాడుతున్న మాటలు వినిపించి, ఇందు ఇక్కడికెందుకొచ్చిందో అర్థమైంది కృష్ణమూర్తికి. చిన్ననాటి జ్ఞాపకాలలో మునిగి తేలుదామని, తన బాల్యాన్ని మరొక్కసారి అనుభవిద్దామని వచ్చింది. నిజమే ఇందు అన్నట్టు ఇప్పుడేదీ, అప్పటిలా లేదు, తనతో సహా.

ఇరవయ్యేళ్ళ వయసులో, ఇందుతో ప్రణయజీవితాన్ని ఊహించుకుని, భంగపడ్డ తాను ఇందుతో అప్పటిలా ఆత్మీయంగా ఉండలేకపోతున్నాడు. ఇందుని అర్థం చేసుకోలేక, తనను కాదని వెళ్ళిపోయిందనుకున్నాడు. కాని పదిహేనేళ్లనాటి ఇందు మనసు ఇప్పుడర్థమవుతుంది తనకు. ఆ వయసులో చదువుతప్ప వేరే దృష్టిలేని ఇందు తనను ప్రియమైన బావగానే చూసుకుంది. ఇప్పటికీ తనను అలాగే అనుకుంటుంది. ఇందు నమ్మకాన్ని నిలబెట్టాలంటే....

★★★

వెళ్లిపోతానన్న ఇందుని "తిధులబట్టి ఎల్లుండే నీ పుట్టినరోజు. అదయ్యాక పంపిస్తా"నని బలవంతంగా ఉంచేశాడు కృష్ణమూర్తి. పుట్టినరోజు ఉదయమే చెప్పకుండా వచ్చిన భర్త సోమశేఖర్ ని చూసి మురిసిపోయింది ఇందు. కానీ కృష్ణమూర్తి పిలిస్తే వచ్చాడని ఎవరూ చెప్పలేదామెకి.

కొత్త బట్టలతోపాటు, కృష్ణమూర్తి ఇచ్చిన బహుమతిని చూసి, ఎగిరి గంతేసింది ఇందు. ఆ బహుమతి, ముప్పయ్యేళ్ల క్రిందటి ఫోటో ఆల్బమ్. అందులో అన్నీ ఇందు ఫోటోలే. చిన్నప్పటినుండి పదిహేనేళ్లవరకు, ఆ ఊరిలో గడిపిన జ్ఞాపకాల గుర్తులే. ఆ ఫోటోఆల్బం అపురూపంగా చూసుకుంటూ "థాంక్స్ బావా. అపురూపమైన నా బాల్యాన్ని ఇందులో పొందుపరిచి నాకిచ్చినందుకు" అంటూ చిన్నప్పటిలా బావను ముద్దుపెట్టుకుంది ఇందు.

తమ పెళ్లిరోజు ఇందుకు కానుకగా యిద్దామని తయారుచేసినదది... తమ పెళ్లి జరగకపోయేసరికి... ఎదురుగా కనిపిస్తుంటే తనలోని జ్ఞాపకాలను రేపుతోందని... స్టోరురూములో ఏ మూలనో పడేసినది.... ఇందుకు యింత విలువైనదని తెలిస్తే, ఏనాడో ఇచ్చి ఉండేవాడు. ఇన్నాళ్లూ ఆమె మనసును అర్థం చేసుకోనందుకు మనసులోనే సిగ్గుపడ్డాడు కృష్ణమూర్తి.

"అన్నగారూ! యింత విలువైన బహుమతి మీరిచ్చి, అంత విలువైన బహుమతి నేనివ్వకపోతే బాగుండదు. కాని ఆ బహుమతి నేనివ్వాలంటే, మీ సహకారం లేకపోతే కుదరదు" అభ్యర్థించాడు సోమశేఖర్.

చెప్పండన్న కృష్ణమూర్తితో, "ఉద్యోగవిరమణ చేశాక, పొలాలు తోటలమధ్య చిన్న ఫార్మ్ హౌస్ కట్టుకొని ఉండాలని ఇందుకి కోరిక. స్థలంకోసం వెతుకుతుంటే, ఒకప్పటి మీ మామిడితోటలో కొంతభాగం అమ్మబోతున్నారని, రియల్ ఎస్టేట్ కి కాకుండా, తోట పెంచితేనే అమ్ముతానన్నారని తెలిసింది. ఆ స్థలంలో పండ్లతోటలు వేసి, మరలా మేమొచ్చేటప్పటికి ఉయ్యాల ఉండాలని నా ఆశ. అలాగే, ఇందుకు ఈ ఊరంటే ప్రాణం. మా పెళ్లైననుండి కొన్ని వందల, వేలసార్లు వినివుంటాను మీ ఊరి గురించి. అందుకని, యెప్పుడూ చూడకపోయినా నా ఊహలలో కూడా అప్పటిలాగే

ఉంటుందీ వూరు. ఈ ఊరిప్పుడు తన చిన్నప్పటి ఊరిలాలేదని, ఇందూ ఎంత బాధపడుతుందో మీరూ గమనించే ఉంటారు. అందుకని ఈ ఊరిని దత్తత తీసుకొని, మరలా దీనిని పూర్వంలా చెయ్యాలని నా కోరిక. దానికి మీ సహకారం కావాలి. దీనికి మీరొప్పుకోవాలి అన్నగారూ!" కృష్ణమూర్తి రెండుచేతులూ పట్టుకుని అడిగాడు సోమశేఖర్.

ఆ మాట వినగానే "బాల్యంలో నేను పొందిన అనుభూతులను భవిష్యత్తులో, నేనే కాదు, ఈ ఊరివాళ్లు కూడా అనుభవించేటట్లుగా ప్లాన్ చేస్తున్న మీకు కూడా థాంక్సండి" అని సోమశేఖర్ ని ముద్దు పెట్టుకుని, "ఇంత మంచి బహుమతులు నా పుట్టినరోజు నాడు, తొలిసారి అందుకున్నానని" భవిష్యత్తులో తన ఊరి అందాలను తలచుకుంటూ, ఆనందంలో తేలిపోయింది ఇందు.

***

COMMENTS